# పరేషాన్

'ఏన్నో జాతర్ల కన్న సమ్మక్క సారక్క జాతర మిన్న". ఆ పూట చిట్‌చాట్‌కు నాందీ
'క్యాం పలికాడు నారాయణ - నావైపు చూస్తూ.

'అదో... నిన్ననే మేడారం జాతర్ల సమ్మక్క సారక్కను చూసొచ్చిన మన రమేష్ చెప్పాలి.
ıనం వినాలి' నా చూపులు రమేష్ వైపు మళ్ళినై. కాని... రమేష్‌లో స్పందన శూన్యం, నా
ుునవ్వుకు బదులివ్వలేదు.

"మేడారం సమ్మక్క సారక్కలు మేలుజేస్తారు గదా" కుర్చీ దగ్గరకు జరుపుకుని
మేష్ భుజం తట్టాడు భద్రయ్య. అయినా కింనాస్తి. రమేష్ మూతి సీలు వేసిన పోస్టు బ్యాగు
'గుంది.

నేను, రమేష్, భద్రయ్య, నారాయణ హైస్కూలు నుండి క్లాసుమేట్సు, గ్లాసుమేట్సుం.
లవుల్లో ఒకరింటికి మరొకరం వెళ్ళేవాళ్ళం. పల్లెల అందాలను కళ్ళారా చూస్తూ
'కాభిరామాయణం, జోకాభిరామాయణాలతో గడిపేవాళ్ళం. ఇప్పుడెవరి ఉద్యోగాల్లో వాళ్ళున్నాం.
ంసార సాగరం ఈదడంలోని అలసట తీర్చుకునేందుకు అప్పుడప్పుడు కలుసుకుని కబుర్లు
ప్పుకుంటాం.

మేడారం జాతర కెళ్ళొచ్చి రమేష్ అనుభవాలు, అనుభూతులు వినాలని వాళ్ళింట్లో
ాచున్నాం. ఆదివారం. ఉదయం తొమ్మిదైంది. ఎప్పుడూ ఏదో ఒకటి వసపిట్టలా వాగే
మేష్ ఇప్పుడిలా పిల్లిముందు కోడిలా బిక్కుబిక్కుమంటున్నాడెందుకో. మొహం ఆరిపోయిన
'రతి పళ్ళెంలాగుంది. భరించలేక పోయాం.

'నీకేమైందిరా ?' అడిగాను కళ్ళలోకి చూడాలని ప్రయత్నిస్తూ.

'ఇదిగో... వేడి చాయ్ అన్నయ్యా !' రమేష్ భార్య జానకి టీ కప్పులతో ప్రవేశించింది.
ాలో 'చాయానందం' చిందులేసింది.

నుదుట అర్ధరూపాయంత కుంకుమ బొట్టు, కాటుక కళ్ళు, చెవులకు మకర కుందనాలు..
'నకి అపర జానకిలాగుంది.

'వీనికేమైందమ్మా !' అడిగాడు నారాయణ టీ కప్పందుకుంటూ.

'ఏమో అన్నయ్యా ! మేడారం నుండి నిన్న సాయంత్రం వచ్చినారు గదా ! రాత్రి భోం
య్యలేదు. ఒంట్లో బాగాలేదా అంటే జవాబివ్వరు. అదేమిటో మీరే తేల్చాలన్నయ్యా !' అంది
'ధగా.

మా ముగ్గురి మొహాలు త్రివర్ణ ముఖచిత్రాలై పోయినై.

'వీని సంగతి మేం చూస్కుంటాం. నువ్వు బేఫికర్‌గా ఉండమ్మా !' టీ సిప్ చేస్తూ హామీ ఇచ్చాడు భద్రయ్య. 'ముందు నువు చాయ్ అందుకోరా !' ఆదేశించాడు రమేష్‌ను. రమేష్ టీ కప్పందుకుంటూ మూడోకన్ను తెరవబోతున్న ముక్కంటిలా తలెత్తాడు. వాడెందుకో బాధ పడుతున్నాడన్పించింది. ముగ్గురి వత్తిడికి తట్టుకోలేక టీ కప్పు గటగటా ఖాళీ చేశాడు. అందరి నరాల్లో చాయ్ వేడి స్వరాలు పలికిస్తోంది. సర్దుక్కూచున్నాడు రమేష్.

'బెల్లం గొట్టిన రాయోలె గప్‌చుప్ గున్నవేందిరా ? సమ్మక్క సారక్కలు నిన్నేమన్నా వరమడిగింగ్రా ?' జోక్ కట్ చేయబోయాడు నారాయణ.

'వరంగాదు గరంగాదు' రమేష్ నోరు విప్పాడండీ.

'మరెందుకురా... ఆముదం తాగిన మొహమూ నువ్వూను' రెచ్చిపోయాడు.

'అబ్బా ! నువు కొంచెమాగురా !' నిలువరించాను. 'ఏమైందిరా. ఏమన్నా పోగొట్టు కున్నావా ?' రమేష్ నడిగాను – కళ్ళలోకి చూస్తూ.

'నిజంగానే పోగొట్టుకున్నాన్రా !' కుర్చీలో ముడుచుక్కూచున్నాడు. జానకి జడుసుకుంది. 'ఏం పోగొట్టుకున్నారండీ !' భర్త పక్కన కూచుంది భయంభయంగా.

'అబ్బా ! నువ్వు ఆగం గాకు ...' మొహం చిట్లించాడు.

'ఒరేయ్ రమేష్‌బాబూ !' లాలనగా వీపు నిమిరాను. 'పోగొట్టుకున్నానంటావు. ఆగం కావద్దంటావు. ఇదేమన్నా పోరగాండ్ల ఆటనా ?'

'ఏమోరా ! మోటకేసిన మొద్దులాగున్న కురుమ గుండయ్య... ప్చ్...'

'ఎవరా గుండయ్య.. ఏమిటా కథ ?' నోళ్లు తెరిచాం.

'నాకు తెల్సురా మీ మొహాలు పేడముద్దలై పోతాయని. ఆ సంగతి చెప్తా వినండి' రమేష్ ఉపక్రమించాడు. కప్పులు ఇంట్లో ఉంచి తిరిగొచ్చింది జానకి. అంతా సర్దుక్కూచున్నాం.

'ప్రతి సంవత్సరం మేడారం జాతరకెళ్లి రావడం మా వంశాచారం. సమ్మక్క సారక్కలకు మొక్కి ఓ కొబ్బరికాయ కొట్టి వస్తే – అకాల మృత్యుహరణం, సర్వవ్యాధి నివారణం జరుగు తుందట. పెద్దల మాట చద్దిమూట గదా ! ప్రతిసారి నేనే వెళ్లి వస్తున్నా..." రెండు కాళ్లు కుర్చీలోకి ముడుచు కున్నాడు. వాడో సూత మహర్షి. మేము శౌనకాది మహామునులమై పోయాం.

"... అలవాటు ప్రకారం పదేళ్ల క్రితం వెళ్లాను.

ఆ రోజు జాతర స్థలం జనసముద్రమై పోయింది. కులమతాల కతీతంగా, ఆటవికులు, జానపదులు, పిల్లలు పెద్దలు ఎందరో ఉన్నారక్కడ. అంతా సమ్మక్క సారక్కలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. పాపం పోలీసులు ! క్యూలో జనాలను నిలువరించలేక పోతున్నారు. ప్రభుత్వం ఏం ఏర్పాట్లు చేసిందో గాని ఏదీ సరిగ్గా లేదు. ఓవైపు జంతుబలి యధేచ్ఛగా సాగిపోతోంది. మరోవైపు శివసత్తులూగుతున్నారు. అడుగు తీసి అడుగు వెయ్యాలంటే అవస్థగా ఉంది.

నమస్కార బాణంతో పోలీసులకు మస్కా కొట్టి, క్యూలో చొరబడి, వెళ్ళి కొబ్బరికాయ కొట్టి వచ్చాను. సప్త సముద్రాలీదినంత సంతోషంతో బయటికొచ్చాను. నా వెనకు నుండి

'పంతులూ... ఓ పంతులూ !' కేక వినబడింది. శ్రీరామ కోతుల్లో బోడ కోతి. అతడెవరో, ఎవర్ని పిలుస్తున్నాడో అనుకున్నాను.

'ఓ చింతమడ్క పంతులూ ! జెర ఆగవేందయ్యా' వెనుక నుంచి నా భుజమ్మీద చెయ్యేశారెవరో. గబుక్కున వెనక్కు తిరిగాను.

ఆరడుగుల ఆజానుబాహుడు, మోకాళ్ళ దాకా ధోవతి, పైన షర్టు లాంటిదేదీ లేదు గాని భుజమ్మీద గొంగళి వేళ్లాడుతోంది. సామ నలుపు ఆకారం. పిడికెడు పిడికెడు మీసాలు. నెత్తికి రుమాలు. ఆందోళనగా ఉన్నాడు. ఎక్కడో చూసినట్టుంది. ఎవరబ్బా అని ఆలోచించేలోగా

'గుర్తు వట్టలేదా పంతులూ ! మా ఊరు చింతమడ్కనే. నేను కురుమ గుండయ్యను. చిన్నగున్నప్పుడు చింతమడ్కలనే ఉంటివి గదా ! నా పిల్లల లగ్గాలు మీ నాయననే చేసిండు. గప్పుడు ఎండాకాలంల మీ నాయిన ఎంబడి బుడ్డ పంచె గట్టుకుని నువ్వు గూడా వస్తుంటివి...' నల్లని మీసాల కింద తెల్లని నవ్వు.

అవును... చదువుకునే రోజుల్లో సెలవులప్పుడు మా నాన్న వెంట పౌరోహిత్యాల కెళ్లేవాడ్ని. అతడు మా ఊరి మోతుబరి. గుర్తుకొచ్చి నవ్వేశాడు. 'అవునవును, నువ్వు కురుమ గుండయ్యవే. నీ కూతరు, కొడుకు... అంతా బాగున్నారా ?' అడుగుతూ చెట్టు కిందికి తీసుకెళ్లాను.

గుండయ్యలోంచి తేజస్సు మాయమైంది. మొహం వివర్ణమైంది.

'అంతా మంచిగున్నరు గాని... గిక్కడనే పరేషాన్ల వడ్డనయ్యా పంతులు. మోస మైందయ్యా, ఇక్కడ నాకెవ్వలూ లేరు. జర... నువ్వే ఆదుకోవాలయ్యా' గబుక్కున కాళ్ళందు కున్నాడు. ఒళ్ళు ఝల్లుమంది. వీడేదో మోసం జేసి సీసాలోకి దింపడు గదా ! ఛఛ.. పల్లెటూరి మోతుబరులు చదువరులు కాకపోవచ్చుగాని సంస్కారహీనులు కారు.

'అయ్యయ్యో.. పెద్దవాడివి. లే గుండయ్యా...' భుజాలుపట్టి లేపాను. అతని కళ్ళను మంచు తెరలు కమ్ముకున్నాయప్పటికే. గుండ్రాయి లాంటి గుండయ్య గులకరాయిలా గయ్యాడు.

'నువ్వో లక్షాధికారివి. నిన్ను... నేనాదుకోవాలా ?'

'దేవుని దయ దప్పితే లచ్చాదికారి గూడా బిచ్చగాడైతడు గద పంతులూ !'

'నిజమే... కానీ.. ఇప్పుడేమైందనీ ? అంతా క్షేమం గదా !'

'సేమమే కాని పంతులూ ! నా ఇంటిదీ, నేను, మా పిల్లలు వాళ్ళ పిల్లలు అంతా కలిసి జాతర కొచ్చినం. పైసల్ని ఎప్పుడూ నా మొల పట్టెడ కింద దాసుకునేటోడ్ని. ఈసారి మా చిన్నల్లుడు గదేందో ప్యాంటుకు ఎనక జేబుల ప్యాకెట్ల పెట్టుకుంటనంటే ఇచ్చిన. సమ్మక్క సారక్కలను ఆనంగ దెస్తుంటే అందరూ ఎగబడ్డరు. ఆ గుంపులల్ల మేమున్నం. గదే లొల్లిల ఎవడో దొంగ... కొడుకు మా అల్లుని జేబుల నుండి ప్యాకెట్ దొబ్బేశిండు. వెయ్యి రూపాయలున్న

ప్యాకెట్ ఉచ్చితార్థంగ పోయింది. ఇప్పుడు చేతుల చిల్లిగవ్వ లేదయ్యా...' చిన్నపిల్లాడిలా గొల్లు మన్నాడు. కడుపులో తెడ్డుతో కెలికినట్టయింది.

'అయ్యో పాపం ! అమాయకులంటే దొంగలకు అలుసైపోయింది. అరెరె ! మరిప్పుడెట్లా? మీ వాళ్ళంతా ఏరీ ?'

'అదేందయ్యా... గా చెట్టు కింద...'

ఇరవై గజాల దూరములో మఱ్ఱిచెట్టు కింద బిక్కుబిక్కుమంటున్న గుంపును చూపించాడు.

'అంతా కలిసి ఎందరున్నారు ?'

'పదిహేను ... మనూరికి పోవాలంటే బస్సు కిరాయిలే ఐదునూర్ల రూపాయలైతయి. ఇక్కడ మనిషికో కల్లు సీసానన్నా కావాలె గదా ! ఎనిమిది నూర్ల రూపాయలిస్తివాంటే మనూరికి పోంగనే నీ పైసల్ని పువ్వులల్ల పెట్టి తెచ్చిస్తానయ్యా...' రెండు చేతులు పట్టుకున్నాడు.

గుండయ్యకు గొఱ్ఱెలు, మేకలు వేలల్లో ఉంటాయని చెబుతుండేవాడు మా నాన్న. తిరుగు ప్రయాణంలో హైద్రాబాద్ హాస్టలున్న మా కొడుక్కిచ్చేందుకు తీసుకెళ్ళిన డబ్బులోంచి పది వంద నోట్లు తీసి గుండయ్య చేతులుంచాను.

గుండయ్య కళ్లు విద్యుద్దీపాల్లా వెలిగినై.

నేను మా ఊరొదిలి పాతిక సంవత్సరాలైంది. ఇప్పుడు నాకా ఊళ్ళో అప్పులుగానీ, ఆస్తిపాస్తులు గానీ ఏమీ లేవు. అమ్మా నాన్నలసలీ లోకంలోనే లేరాయె. ఈ డబ్బు తిరిగి వస్తుందా ?

'చూడు గుండయ్యా ! ఆపదలున్నావని ఇచ్చినా. తిరిగి ఇవ్వకుంటే...' వార్నింగివ్వ బోయాడు.

'అయ్యో బాంచను... గంత పంజేస్తనా ? ఈ జన్మల అప్పుజేసి కట్టకుంటే మల్లాజన్మల నీ ఇంటి కుక్కనై పుట్టాలె' నోట్లను కళ్ళకద్దుకున్నాడు. 'ఇంగ ఇప్పుడు మొక్కులు గూడా ఇచ్చి పోతానయ్యా' మురిసిపోయాడు.

నేను ఇంటికి వచ్చాక మూడోరోజు గుండయ్య వచ్చి పదిహేను వందల రూపాయలిచ్చాడు.

'ఇదేందీ ! నీకు చేబదులిచ్చింది వెయ్యే గదా !'

'గంతే. కాని మిగితా పైకము నా ఖుషీతో ఇచ్చినానయ్యా. వద్దనకు పంతులూ !' చేతులు జోడించి బతిమిలాడాడు.

'వద్దు... వెయ్యి రూపాయలు చాలు' మనసొప్పలేదు.

గుండయ్య ససేమిరా అన్నాడు.

'దాంతల్లి... పైసల పెండ్లాం ముండవొయ్య. ఆ యాల్ల నువ్వా పైసలియ్యకపోతే నా గతేంది పంతులూ ! నేను సంతోషంగా ఇస్తున్నా, కాదనకు పంతులూ !' కాళ్లకు మొక్కాడు.

కాదనలేక పోయాను. లక్షల అప్పు లక్షణంగా తీర్చినట్టు సంబరపడిపోయాడు. నేల మీద గొంగడి వేసుక్కూచున్నాడు. రుమాలు దీసి నెత్తి గోక్కుంటూ.

'నాదో అనుమానమయ్యా !' నా మొహంలోకి చూశాడు.

'ఇట్రా ... ఈ కుర్చీలో కూచో' పిలిచాను. అతడంగీకరించలేదు. అతని గొంగడి విప్పి పరిచి ఇద్దరమందులో కూచున్నాం.

'అనుమానం పెనుభూతమన్నారు. ఎందో అడుగు'

'సమ్మక్క సారక్క జాతర్ల నా పైసలెందుకు పోయినయో... ' రుమాలు చుట్టుకున్నాడు. 'నేనేమీ తప్పు చెయ్యలేదు. మొక్కులు ఎగవెట్టలేదు. ఆ దేవత నన్నెందుకు పరేషాన్ చేసింది పంతులూ ?'

ఆ పరేశానేదో నేనే చేయించినట్టు అడిగేశాడు. విస్తుబోయాను. ఏం జవాబు చెప్పాలో తోచలేదు. జ్యోతిషం నేర్చుకొమ్మని మా నాన్న నెత్తీనోరు కొట్టుకుని మొత్తుకున్నా వినకపోతి. అందులో అఆలు కూడా రావాయె. నాకు తెలీదు అంటే పంతులు పస ఇంతేనా ? అనుకుంటాడు. ఏదో ఒకటి చెప్పాలి. కాస్సేపలాగే శూన్యంలోకి చూసి వేళ్ళ మీద లెక్కలు వేసినట్టు నటించి సంగతంతా అవగతమైనట్టు పోజిచ్చాను.

'ఏం లేదు గుండయ్యా. నువ్వేమీ తప్పు చేయలేదు. కాని మీ అయ్య జేసిన తప్పు బాపతు దోషం నీమీద కొచ్చింది. అందుకే ఈ పరేషాన్' అలవోకగా నవ్వేశాను.

'మా అయ్యనా ! అయ్యల్లా... ఏం తప్పు జేసిండయ్యా' నోరెల్లబెట్టి వివరాలడిగాడు. మూల్గే నక్కమీద తాటిపండు పడింది. నా అవస్థను నాలోనే దాచుకుని

'మీ అయ్య ఓసారి సమ్మక్క సారక్కలకు ఓడిబియ్యం పోస్తానని మొక్కిండు. మరిచి పోయిండు. బస్.. గంతే !' నరికి పారేశాను. దీంతో ఇగ లేచిపోతాడనుకున్నాను.

'అర్రెర్రే.. దీనవ్వ... గట్లనా పంతులూ !' గుండెలు బాదుకుంటూ నవ్వేశాడు. నోరు బారెడు తెరుచుకుంది. పైకి లేచిన మీసం కట్టు ఎక్కుపెట్టిన బాణంలా కన్పించింది. 'ఓర్నీ... మరీ... గా దోసం పోవాలంటే నేనేం జెయ్యాలె పంతులూ ?'

అమ్మబాబోయ్ ! వీడు తుమ్మబంకలా అంటుకుపోయాడే ! కుతకుతలాడాను. కోపం బయటికొస్తే కొంప మునుగుతుంది. నా పరువు మర్యాదల్ని చింతమడ్క చెరువులో కప్పేస్తాడు. నన్నింత బాధ పెడ్తున్నందుకు కుక్కకాటుకు చెప్పు దెబ్బలా కొట్టాల. ఏదో కసి...

' మీ అయ్య ఓడిబియ్యం బోస్తే వెయ్యి రూపాయలు ఖర్చయ్యేది. నువ్వు ప్రతి ఏటా ఓ మంచి మనిషికి రెండువేల రూపాయలు దానం జేస్తే... దోషం తొలగిపోతుంది'.

'గట్లనా ! తప్పక దానం జేస్తా. కానీ... నిన్ను మించిన మంచి మనిషి నాకెవడు దొరుకుతడూ ? నిన్ననే పది గొర్రెపిల్లల్ని అమ్మిన ఇగో... నువ్వే దానం దీసుకో' అంటూ నడుము పట్టెడలోంచి రెండు వేల రూపాయలు తీసి నాకిచ్చి కాళ్ళ మొక్కాడు.

ఇతడు భక్త కన్నప్ప అవతారం కాదు గదా ! అనుకోని సంఘటనకు అపాంతం చలించిపోయాను. పాపం ! అమాయకుడు. నా మీద ఎంత విశ్వాసం, నన్ను నేనే తిట్టుకుని ఊరుకున్నాను. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం వచ్చి రెండు వేల రూపాయలు నాకిచ్చి పోతున్నాడు. ప్రతిసారి నా అంతరాత్మ 'నువ్వో మోసగాని'వని తిడుతోంది. కక్కలేక మింగలేక ఈ విషయం ఎవ్వరికీ చెప్పలేదు. అది మనసులో మెదిలినప్పుడల్లా గుండెల్లో గుండుసూదులు గుచ్చుకుంటున్నై. ఖూనీ చేసి తప్పించుకు తిరుగుతున్న వాడిలా ఫీలవుతున్నాను. ఈసారి గుండయ్య డబ్బు తెస్తే... ఏమైనా సరే నిజం చెప్పి డబ్బు వాపసివ్వాలనుకున్నాను. కాని... మొన్న గుండయ్య కొడుకు మేడారం జాతరలో కలిసి – వాళ్ళ నాన్న నెలరోజుల క్రితమే చనిపోయాడని చెప్పాడు. నా గుండె గుబగుబలాడింది. నేను కురుమ గుండయ్య రుణమెట్లా తీర్చుకోవాలి ? అమాయకునికి మాయమాటలు చెప్పి మోసంజేసిన పాపానికి ప్రాయశ్చిత్తం ఎట్లా చెల్లించుకోవాలి?' ముగించి తల పట్టుక్కూచున్నాడు.

'నువ్వేమన్నా గుండయ్య జేబులోంచి గుంజుకున్నావా ? ఆ సంగతి మర్చిపో' నారాయణ నవ్వేశాడు.

'నోనో' రమేష్ అరుపులకు అంతా ఝుడుసుకున్నాం.

'మరెట్లానండీ ? గుండయ్య కొడుకును పిలిపించి నిజం చెప్పి డబ్బు వాపసిస్తామన్నా... అతని సెంటిమెంట్సు ఒప్పుకోవు' నచ్చజెప్పబోయింది జానకి.

'నో... వీల్లేదు. ఏదో విధంగా గుండయ్య రుణం తీర్చుకోవాల్సిందే. లేకపోతే ఈ పాపభీతి నన్ను దహించి వేస్తుంది' మా చేతులు పట్టుకొని బతిమాలాడు.

రకరకాలుగా చర్చలు జరిగినై. ఎన్నో కోణాల నుండి తర్కవితర్కం జరిగింది. నా బుర్రలో ఓ మెరుపు మెరసింది.

'డబ్బూ దస్కం అన్నీ వున్న గుండయ్య మాయమాటలు నమ్మడానిక్కారణం అవిద్య. గుండయ్య డబ్బుతో పలకా, బలపాలు, పెద్ద బాలశిక్షలు కొని మన సేవాభావాన్ని తోడు చేద్దాం. అదే చింతమడ్క ఊళ్ళోంచి నిరక్షరాస్యతను తరిమేద్దాం...' మెరుపును బయటపెట్టాను. ఆ మెరుపు అందరి మొహాలను కాంతివంతం చేసింది.

'బాగుంది చాలా బాగుందిరా !' ఎగిరి గంతేశాడు రమేష్. వాని పరేషాన్ పటాపంచలైంది.

**3 డిసెంబర్, 2000**
**ఆదివారం ఆంధ్రభూమి లో**
**ప్రచురితమైంది.**